ఎగిరిపోయాక మనం చచ్చేం బతికేం? అల్ల కాటిమీద కెక్కించిననాడు సర్వపావకుడైన అగ్నిహోత్రుడికి తెలంగాణవాడూ, ఆంధ్రావాడూ ఒకటే! ఖద్దరు జెండా మీదను కప్పుకుని గన్ కారేజీమీద స్మశానానికొచ్చినవాడూ, మునిసిపాలిటీ చెత్తబండీలో తీసికొచ్చిన లేదా తీసుకురాబడినవాడూ ఒక్కటే. వీడు బతికినంత కాలం ఎలా బతికేడు? ఏయే మంచి పనులు చేశాడు? ఎందరి కుపకారం చేశాడు? ఎవరెవరి కంటతడి తుడిచాడు? యిలా అనుకునేలా తనువు లాగించేయటం ముఖ్యంకాని ఎందరి కొంపలార్పాడు? ఎన్ని సంసారాల్లో చిచ్చు పెట్టాడు? ఎందరి ఉపకారులకి అపకారం చేశాడు? ఎందరు మానవతుల్ని అవమానించాడు? ఎన్ని అబద్ధాలాడాడు? యిదా ప్రయోజకత్వం?

ఇప్పుడు చెప్పండి - "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" అని పాడాలంటే ముక్కలు దిగకుండావున్నాయి. మనసులో లేంది పైకి పాడాలంటే కష్టం. పాట రాక గింజుకుంటూంటే మావారు "ముఖ్యమంత్రీ! ముఖ్యమంత్రీ!" అంటూ వచ్చారు. "నాకది కడు ఇన్సల్ట్‌కరంబగు పదమై దోచెఁడున్" అన్నాను. నేను రాజునైతే నువ్వు నాకు మంత్రివి - ముద్దొచ్చే మంత్రివి కనుక ముఖ్యమంత్రి అన్నాను తప్పా.

"అబ్బ, చివాట్లుతినే వుద్యోగం - నాకొద్దు బాబూ" అన్నాన్నేను. మీరు రాజైతే నేను రాణీ అవాలికాని మంత్రేవిటండీ మంత్రీ గింత్రీనూ అన్నాను కంగిస్తూ. నీది చివాట్లుతినే ఉద్యోగవేకదా మంత్రన్నాను నన్ను క్షమించాననవా హృదయదాసీ అన్నారు.

నన్నెప్పుడూ మంత్ర నకండి అది కడుం గడు ఇన్సల్టుకరంబైన పదంబై తోచె - ఏవిటి నీలో నీవేదో పాడుకుంటున్నావ్ - అన్నారు. మా తెలుగు తల్లికీ మల్లెపూదండ అన్నపాట జ్ఞాపకం చేసుకుంటున్నాను సార్ అన్నాను. జ్ఞాపకం చేసుకోకు అన్నారు గంభీరంగా మొహంపెట్టి.

ఇంట్లో చప్పుడయింది. పిల్లి పాలగిన్నెను తిరగదోసింది లేవ్వేం అన్నారు శ్రీవారు. లేవలేనన్నాను. మొండితనంకాదు. దేశంలోని ట్రాజిడీవలన కలిగిన ఒక ఫీలింగు. పిల్లి మూతి నాక్కుంటూ మా ముందునుంచే వెళ్తోంది. దాన్ని ఓటెయ్యండి రాయుచ్చుకుని అన్నాను. "మీదబడి పీకుతుందే" అన్నారు. నాకు నవ్వొచ్చింది, ఏడుపొచ్చింది, చిరాకొచ్చింది, కోపవొచ్చింది. 'గెటవుట్' అన్నాను. మావారు వెళ్ళిపోయారు. లోపలకెళ్ళి స్టాండపాంది బెంచి అన్నాను. మావారు బెంచీ మీదెక్కి నిల్చున్నారు. నేనూ వెళ్ళి వారి ప్రక్కన నిలబడ్డాను.

# సైంటిఫిక్ సంసారం

వెనక మా నాయనమ్మ పెద్దప్పగారి కూతురి మనవడు టి.పి.యం. రావు బెనారస్‌నించొచ్చాడు. అతనికి మా అమ్మమ్మ మూడో తమ్ముడి మనవరాల్నే యిస్త. అంతా బీరకాయపీచే.... దాన్ని "జాకీ" అని పిలుస్తాడు దాని మొగుడు ముద్దుగా. "న" సైలంటట.

టి.పి.యం. రావు అనగా తడకల పూర్ణమల్లిఖార్జునరావు. సైన్సు బావగారంటారు మరదల్సు. "జాకీ, నీ సైన్సు మొగుడేవంటున్నాడే" అని అంతా దాన్ని వేళాకోళమాడ్తుంటారు. (సైన్సు మొగుడంటే పాపం దానికి హిస్టరీమొగుడూ జాగ్రఫీ మొగుడూ అని వేరే వున్నారనుకునేరు కొంపతీసి. అది అభం శుభం ఎరగనిపిల్ల).

మొగుడ్ని ఇదిగో ఏవండీ అనకూడదు. పేరెట్టి పిలవాల్సిందే అని రూలు. టి.పి.యం. రావని నోరు తిరక్కపోతే పూర్ణంగారని పిలు అని మేమే సలహా యిచ్చాం. పూర్ణంగారింట్లో వున్నంతసేపూ టర్కిష్‌టవలు మీదేసుకొని తురక లుంగీ కట్టుకుని ఒళ్ళో పేపరు పడేసుకుని మొరుగుతూ వుంటాడు. అది సైన్సు మొరుగుడు - సయించిన వాళ్ళకు సయిస్తుంది. సయించనివాళ్ళకు సైన్సే గతి. రవుడీబావ గారు అప్పుడప్పుడు పులిచారల పైజమాలువేసి ఇంట్లోకూడా చెప్పులు తొడుక్కుని తిరుగుతాడు. అతనికి సంకురాత్రికి, ఉగాదికి, దీపావళికి జరీ పంచెలూ కండువాలూ పెడ్తే, "అన్‌సైంటిఫిక్" అని వాటిని చింపించి కళ్ళీ లాల్చీలు కుట్టించాడు. పట్టుపంచెల చాపుక్కూడా ఆ గతేపట్టించాడు. మొహంమీద నల్లకళ్ళద్దాలు తీయడు.

మా జాకీ పండుగల్లో నోములు నోచుకుంటే దాని కొంగుపట్టుకు లాగి మడి మైలా ఆచారం అంతా "అన్ సైంటిఫిక్" అని అల్లరిపెడతాడు. ఎంగిలి మళ్ళీ సైంటిఫిక్కేనట -

సైన్సుబావగారు జాకీని వుండుండి ప్రశ్నలతో వేధిస్తూవుంటాడు. మచ్చుకి -

"మీ అమ్మ మీ నాన్న కేమవుతుంది?" అన్నాడ్ట.

"అదేవిటండీ!" అని అది అయోమయంగా చూసిందట.

"మీ అమ్మకు మీ నాన్న ఏమవుతాడు!"

"నాకేం తెలుసండీ!"

"యూ బ్రూట్ - కనుక్కు చెప్పు" అని లోపలికి తగలడ్డాట్ట. అల్లుడికి మతిపోయిందేమోనని అత్తగారు కంగారుగా వచ్చి "ఏవిటి నాయనా? పిల్లను కోప్పడ్డావుట. అది ఏడుస్తూ కూర్చుంది." అని కళ్ళొత్తుకుంది.

"అదికాదు. నేనే ఏడవాలి.... వట్టి అన్‌సైంటిఫిక్ మొద్దు. మావగారు పెళ్ళికాకముందు మీకెలాగ చుట్టమో కనుక్కురమ్మన్నా. ఇడియట్ వంటింట్లోకెళ్ళి కూచుంది."

"ఓహ్ అదా, ఆయన నాకు మేనమావేగా - మా అమ్మకు స్వయానా తమ్ముడు."

"అలాగా - అయితే మీరు మీ తండ్రివరస వాడ్ని పెళ్ళిచేసుకున్నారన్నమాట."

"రామ! రామ! అవేం మాటలు నాయనా?"

"తండ్రికి తమ్ముడు, తల్లికి తమ్ముడు ఒహటే కదండీ. మీ మారేజి అన్‌సైంటిఫిక్!"

"నేనేం పాపంచేశానురా భగవంతుడా? ఈ పిల్లాడిలాటి కూతలు చూస్తున్నాడు." అని ఆవిడ రాగాలు మొదలెట్టింది.

అప్పుడు వంటిట్లోంచి రాకెట్లా దూసుకునివచ్చి జా(న)కి - "మా అమ్మ నెందుకు ఏడిపిస్తున్నారు? అవాకులూ, చెవాకులూ పేలి" అని అడిగింది.

"సైన్సంటే నీకు అవాకులూ, చెవాకులుగానూ వుందా?"

"వుండండి మా నాన్నను పిలుస్తాను" అని అది వాళ్ళ నాన్నను పిల్చుకొచ్చింది. ఆయన లోపలికిరాకుండానే "ఏంటోయ్ సైన్సల్లుడూ?" అని గొణుక్కుంటూ "మీ అత్తగారేవిటి చాపచుట్టలా వాలిపోయింది?"

"వాలిపోవడంకాదండీ? మేనకోడలు మీకు హాఫ్ డాటరు కూతురి వరస... కూతుర్నెలా పెళ్ళాడారండీ మావగారూ?"

ఆయన కొంచెం తేరుకొని "బాగుందోయ్ నీ వరస. అక్క కూతురు పెళ్ళికి వరసే. పనికొస్తుంది. తండ్రి ఆస్తి కూతురు అనుభవించలేకపోయినా మనవరాలైనా తింటుందిగదా అన్న ఆశతో మా అక్క."

"మీ అక్క చాలా అన్‌సైంటిఫిక్కండీ - ఈ పెళ్ళి సంగతి వింటే పాశ్చాత్యులు ఔరా అని ముక్కుమీద వేలేసుకుంటారు."

"మేనరికాలు, మేనమావ మేనగోడల్ని చేసుకోవటాలు తెలుగువారికి విధాయకమోయ్."

"ఇది చాలా బార్బరస్ మావగారూ! మేనరికాల పేరుచెప్పి తెలుగు వాళ్లు అన్నా చెల్లెళ్ళకు పెళ్ళిళ్లు చేసేస్తున్నారు. మేనమావనని చెప్పి కూతురివరస పిల్లను పెళ్ళాడేస్తున్నారు. ఇది వింటే నాగరికలోకంలో మనకు తలవంపులు - ఐ యామ్ టెరిబులీ అషేమ్‌డ్ ఆఫ్యూ."

"పోన్లేవోయ్. మన పురాణాల్లో కూడా మేనరికాలున్నాయిగదా - సుభద్రార్జునులు. శశిరేఖాభిమన్యులు."

"మన పురాణాలన్నీ అన్ సైంటిఫికండీ"

అప్పుడు జా(న)కి మధ్యలో కల్పించుకుని -

"నన్ను కూడా అన్‌సైంటిఫికంటారేవిటి కొంపతీసి" అని నవ్వింది. సైన్స్‌బావగారు "ఆహ్హా" అని తల వూయించారు.

"మరి మన ఓల్డుకస్టమ్సు అన్నిటికీ ఏదో ఒక ప్రయోజనంచూసే ఏర్పరిచారంటారు పెద్దలు" అని గొణిగారు మావయ్య.

"ఎవరండీ పెద్దలు? ఆస్తులకోసం ఈ హంబగంతాఏర్పరిచారండీ మనవాళ్ళు. ఈజిప్టులో రాజవంశాల్లో అన్నాచెల్లెళ్లే పెళ్ళాడి రాజ్యాలు ఏలేసరికి ప్రజలుకూడా ఈ ఫాషనే అవలంబించార్ట."

"రామ రామ! నారాయణ నారాయణ!" అని అత్తగారూ మావగారూ చెవులు మూసుకున్నారు. అప్పుడు సైన్సుబావగారు "మనం ఒక మెట్టు దిగువనున్నాం, మన మేనరికాలూ వగైరా అలాటివే."

"ఇహ నావిషయాలు వదిలేసి మినపసున్నితింటూ పిల్లతో కబురుచెప్పు." అని పెద్దావిడ షెడ్డులోకి రైలింజన్లా రొప్పుతూ నిష్క్రమించింది. మావగారు కొంచెం నాస్టీగా ఫీలయినట్టున్నాడు పాపం - దూలాలు లెక్కపెడుతున్నాడు.

"మీ యింటి దూలాలు మీరే లెక్కపెడుతున్నారు అంకుల్" అని నవ్వాడు టి.పి.యం.రావు.

"చెడ్డ అసాధ్యుల్లా గున్నావోయ్ నువ్వు" అని మావయ్యగారు పొట్ట ఎగరేసుకుంటూ నవ్వేరు.

ఇది జరిగి శాన్నాళ్ళయిందనుకోండి! మా సైన్సు బావకి అన్ సైంటిఫిక్‌గానే వరసాగ్గా నలుగురాడపిల్లలు కలిగారు. జాకీ, పూర్ణంబావా మొగపిల్లాడికోసం కలలు గంటున్నారు. మొగపిల్లాడు సైన్సుకి దొరక్కుండా వున్నాడు.

మతంలోనూ, కళల్లోనూ, జీవితంలోనూ వున్న మిస్టరీని సైన్సు విడగొడుతోంది. ఒప్పుకుంటాం - కాని అజ్ఞానంలోనూ మూర్ఖత్వంలోనూ వున్న రొమాన్సుని సైన్సు కిల్ చేస్తోంది. అవునంటారా - కాదంటారా? మొన్న అపోలో 8 లో చంద్రమండలాన్ని కళ్ళారా చూసొచ్చి ఫొటోల్ని భూమ్మీదకు దింపినవాళ్లు వెల్లడిచేసే నిజాలు వింటూంటే 'చందమామ' లో వున్న ఛారమంతా హరించి ''ఇంతేనటే చంద్రుడెంతో యనుకొంటి'' అని తిరగేసి చెప్పుకోవాలిసొస్తోంది.

చేతికందని జాబిల్లి కోసం మారాంచేసే మానవుడు. తెలిసీ తెలియని వూహలల్లి ఆ వూహలన్నీ బుట్టదాఖలా కావడం భరించగలడా? ముందస్తిగా సినిమావాళ్లు "చందమామ" సాంగ్సు కొత్తవి రాయించడం మానకపోతే, జనం రొమాన్సు తగ్గిన చంద్రుడితో సరసాల్ను చూసి భరించలేకపోవచ్చు.

సైన్సు కొన్ని విలవల్ని దివాలా తీయిస్తుంది. అది తల్చుకుంటే రిలిజయన్ని, ఆర్టునీ దవడ వాయగొడ్తుంది. మా టి.పి.యం. రావు బావగారు ఒకటి రెండేళ్ళలో కూతురి పెళ్ళి చేయాలి. వాళ్ళావిడ జా(న)కి అన్‌సైంటిఫిక్‌గా మేనరికం చేస్తానంటోంది. దాని సైన్సు మొగుడు సైంటిఫిక్‌గా మరో సంబంధం చేయాలంటే వేలకు వేలు కట్నం పోయాలి. డైలమాలో పడ్డాడు. మొన్న బెజవాడ ప్లాట్‌ఫాంమీద కనిపించాడు. మేం వాల్తేరునుంచి వస్తున్నాం.

"ఇది విన్నారా - తారాశశాంకం ఎంత అబ్సర్డ్ స్టోరీయో! అస్సలది జరగేలేదట-" అన్నాడు మావారితో.

"పోన్లెండి. అలాటివి జరుగుతాయి. అది జరగలేదు కాని" అన్నారు మావారు.

"మీ పెద్దమ్మాయి పెళ్లి సెటిల్ చేశారా అన్నా!"

సైన్సుబావగారు బుఱ్ఱ గోక్కుని "మనవాళ్ళు వట్టి అన్‌సైంటిఫిక్ పీపులండీ" అని గొణిగాడు. అన్నట్టు జాకీ మళ్ళీ కడుపుతోవుందిట - అన్ సైంటిఫిక్ లేడీ. ఈమారేనా మొగపిల్లాడు కలిగితే - బావ చంద్ర మండలంలో పాదం పెట్టినట్లే.